క్లుప్తంగా

బస్ షెల్టర్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

కవిటి: మండలంలోని సహలాలపుట్టుగలో బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్‌లు శనివారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.6 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. భవనాన్ని వేగవంతంగా నాణ్యతతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.రవి, బి.మురళి, డి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



ఢిల్లేశ్వరిని సత్కరిస్తున్న రామారావు తదితరులు

కవిటి: మండల కేంద్రంలోని పల్లివీధికి చెందిన పొల్లాయి ఢిల్లేశ్వరి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 573 మార్కులు సాధించింది. దీంతో ఢిల్లేశ్వరిని కవిటికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పాండవ రామారావు సత్కరించి, రూ.10,000ల నగదు ప్రోత్సాహకాన్ని శనివారం అందించారు. విద్యార్థిని భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సభ్యులు

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరు(నెహ్రూ పార్క్)లో క్లబ్ సభ్యుడు లండ నాగరాజు సమకూర్చిన మొక్కలు శనివారం నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దడియాల నరసింహులు, సభ్యులు రాము పాత్రో, పండరి బుజ్జి, సంతోష్ పాత్రో, వెంగల సూర్యం, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కామాక్షమ్మకు నగదు అందిస్తున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేధారిపురం గ్రామానికి చెందిన ఉర్జాన వాసుదేవ్ అనే వృద్ధుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అసలే పేదరికం, ఆపై జబ్బు చేయడంతో చికిత్స చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన 'కేపీఎం గల్ఫ్ ఫౌండేషన్ గ్రూప్' సభ్యులు స్పందించారు. శనివారం బాధితుడిని పరామర్శించి, ఆయన చికిత్స కోసం భార్య కామాక్షమ్మకు రూ.20 వేలు ఆర్థిక సాయంగా అందించారు.

ఈ–శ్రమ్ కార్డు కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నిర్మల

టెక్కలి: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగా ఈ–శ్రమ్ కార్డు కలిగి ఉండాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల సూచించారు. అసంఘటిత కార్మికుల వారోత్సవాల్లో భాగంగా శనివారం టెక్కలిలో జీడి పరిశ్రమ, వెలుగు కార్యాలయాల్లో అవగాహన కల్పించారు. ప్రతీ కార్మికుడు ఈ–శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని కార్డును పొందాలని, దీనివలన అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, న్యాయవాదులు చంద్రశేఖర్ పట్నాయక్, పి.ఆనందరావు, పి.సాయిరాజు, ఏపీవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం నిమజ్జనోత్సవం



నిమజ్జనానికి వెళ్తున్న భక్తులు

కవిటి: మండలంలోని చిన్నకర్రివానిపాలెంలో గడచిన ఐదు రోజులుగా నిర్వహించిన కాశీవిశ్వనాథ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవ ముగింపులో భాగంగా శనివారం పూర్ణ కలశాల నిమజ్జనోత్సవ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి ఎదురుగా ఏర్పాటు చేసిన పూర్ణ కలశాలను సమీపంలోని సముద్ర జలాల్లో కలిపారు. అనంతరం అన్నదాన వితరణ చేపట్టారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

- అభివృద్ధికి నోచుకోని డైలీ మార్కెట్
- శిథిలావస్థకు చేరిన దుకాణాలు
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ఇచ్ఛాపురం డైలీ మార్కెట్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి 9వ వార్డులోని డైలీ మార్కెట్‌లో సమస్యలు తిష్టవేశాయి. మార్కెట్‌లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కొనుగోలుదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్కెట్‌లో ఉన్న దుకాణాలకు సుమారుగా నాలుగు దశాబ్దాలు దాటిపోవడంతో ఈ షాపులన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ డైలీ మార్కెట్‌లో ప్రస్తుతం 46 షాపులు ఉన్నాయి. ఇవి కాక మార్కెట్‌లో ఫుట్‌పాత్ పైన చిన్నషెడ్లు, పాకలు ఏర్పాటు చేసుకొని సుమారుగా రెండు వందల మందికి పైగా వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ మార్కెట్‌కి ఇరువైపులా గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని మున్సిపల్ అధికారులు పూర్తిగా తొలగించారు. కానీ వాటి స్థానంలో కొత్తగా ఎటువంటి గేట్లను ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులు మార్కెట్‌లోనికి ప్రవేశిస్తుండడంతో కొనుగోలుదారులు, అమ్మకందారులు అప్పుడప్పుడు గాయాల పాలవుతున్నారు.

వర్షంవస్తే బురదమయం

మార్కెట్‌పై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో చిన్నపాటి వర్షానికే మార్కెట్ మొత్తం బురదమయంగా మారుతోంది. మున్సిపాలిటీకి చుట్టుపక్కల ఉన్న ఆంధ్ర, ఒడిశా గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన మార్కెట్. దీంతో మార్కెట్‌కి రోజూ వందల సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. పండుగ రోజుల్లో అయితే వేల సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. కానీ కొనుగోలుదారులకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అందువలన సుమారు మూడు ఎకరాల విస్తీర్ణం ఉన్నవంటి ఈ మార్కెట్‌ను, మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్‌ని అభివృద్ధి చేస్తాం



మున్సిపాలిటీలో ఉన్నటువంటి డైలీ మార్కెట్‌ని అభివృద్ధి చేస్తాము. ప్రస్తుతం ఈ విషయం డీపీఆర్‌వో స్థాయిలో ఉంది. డీపీఆర్‌వో పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదించి అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టేందుకు కృషి చేస్తాం.

– ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

మార్కెట్ మొత్తం సమస్యలే



డైలీ మార్కెట్‌లో సమస్యలతో చాలా రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నాం. ఉండడానికి నీడలేని పరిస్థితుల్లో ఉన్నాం. మార్కెట్‌లో వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు గానీ అభివృద్ధిని పట్టించుకునేవారు కరువయ్యారు. వర్షం పడితే మార్కెట్ మొత్తం బురదతో నిండిపోతుంది. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులంతా చాలా ఇబ్బందిపడుతున్నారు. మార్కెట్‌లో మరుగుదొడ్లు లేకపోవడం అనేది అత్యంత ఇబ్బందికరమైన పరిస్థితి. ఇప్పటికైనా అన్ని రకాల సదుపాయాలను కల్పించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

– దమయంతమ్మ, కూరగాయల వ్యాపారి

రియల్ ఎస్టేట్‌కు వత్తాసు పలికేందుకే పదవులు

- టెక్కలిలో మైనింగ్ మాఫియా
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్



కార్యకర్తలతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: రాజధానిగా విశాఖపట్నం కాకుండా, అమరావతిలో రియల్ ఎస్టేట్‌కు వత్తాసు పలికేందుకే ఉత్తరాంధ్రకు చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పదవులు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ దుయ్యబట్టారు. శనివారం టెక్కలి పార్టీ కార్యాలయంలో కోటబొమ్మాళి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అన్ని రకాల సదుపాయాలు కలిగిన విశాఖను రాజధానిగా చేయడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. అయితే విశాఖకు వ్యతిరేకంగా పనిచేయడానికి రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు మంత్రి పదవులు ఇచ్చారని మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల అండదండలతో వారి కుటుంబ సభ్యులు విచ్చలవిడిగా మైనింగ్, లిక్కర్ మాఫియాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అన్ని రకాల అర్హతలు కలిగిన ప్రజలకు సంక్షేమ పథకాలు తొలగిస్తున్నారని, ప్రజలకు అండగా పోరాటం చేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. దీని కోసం గ్రామ స్థాయిలో కమిటీల నియామకాలు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కోటబొమ్మాళి మండలంలో కూటమి కార్యకర్తలు చేస్తున్న అక్రమాలపై వివరాలు సేకరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు, నాయకులు రోణంకి ఉమా మల్లయ్య, దుక్క రామకృష్ణారెడ్డి, ఎన్.సత్యరాజ్, ఎస్.వినోద్, కె.రామరాజు, కె.సంజీవ్, జి.చిరంజీవులు, జి.కేశవరావు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెట్లకొమ్మలు తొలగింపుపై విమర్శలు



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్ రోడ్డులో దశాబ్దాల క్రితం నుంచి ఉన్న భారీ మర్రి, రావి వృక్షాల కొమ్మలను తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చక్కని నీడనిస్తున్న చెట్ల కొమ్మలను నరికేయడంతో చాలా వరకు నీడ కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. మెయిన్‌రోడ్డులో 4 భారీ వృక్షాల కొమ్మలు తొలగించారు. దీంతో వాటి కింద సేదతీరేవారు ఆందోళన చెందుతున్నారు. గ్రామదేవత ఉత్సవాల డెకరేషన్‌కు అడ్డుగా వచ్చే చిన్నపాటి కొమ్మల్ని తొలగిస్తే సరిపోయేదానికి, పెద్ద పెద్ద కొమ్మల్ని తొలగించడంతో ప్రస్తుత వేసవికాలంలో ఇబ్బందులు ఏర్పడుతాయని వాపోయారు.

మొగలి తోటలతో ఆర్థికాభివృద్ధి



మొగలి రైతులతో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: సముద్ర తీర ప్రాంతాల్లో మొగలి తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన బూర్జపాడు పంచాయతీలో డొంకూరు, లక్ష్మీపురం గ్రామాల్లోని మొగలి తోటలను పరిశీలించి సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సముద్ర తీర ప్రాంతంలో విరివిగా పెరిగే మొగలి చెట్లు వలన అధిక లాభాలను అర్జించవచ్చని, సస్యరక్షణ చేపడితే మరిన్ని పూలు పూసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా మొగలి పూలు తీస్తున్న విధానం, చెట్ల రక్షణకు తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మొగలి పూలతో సుగంధ ద్రవ్యాలు తయారు చేస్తున్న కేంద్రాన్ని సందర్శించారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రాయితీపై మొగలి బట్టీల నిర్మాణానికి రుణ సహాయం చేస్తే, మరింత మంది కార్మికులు జీవనం సాగిస్తారని రైతులు అధికారులకు తెలిపారు. ఆయనతో పాటు డీపీఎం నారాయణరావు, వెలుగు ఏపీఎం ఎస్.ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న భక్తులు

నందిగాం: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. బలిడె మల్లేశ్వరరావు, జినగ ఆదినారాయణ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు మేడేపల్లి రమేష్‌శర్మ శాస్త్రోక్తంగా విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం తిరువీధి చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సరుకులకు రక్షణేది..?

- ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద నిఘా కరువు
- పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు



టెక్కలి ఎంఎల్‌ఎస్ పాయింట్



గోడౌన్‌లో నిల్వ చేసిన రేషన్ సరుకులు

టెక్కలి: ఒకవైపు ప్రజా పంపిణీ సరుకులు అరకొరగా సరఫరా జరుగుతుంటే.. మరోవైపు వాటిని నిల్వచేసే గోడౌన్ వద్ద నిఘా కరువైంది. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా ఉన్నటువంటి మైదానం వద్ద ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్ (మండల స్థాయి స్టాక్ పాయింట్) గోడౌన్ వద్ద గత మూడు నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో ఆయా గోడౌన్‌లో నిల్వ చేస్తున్న సరుకులకు భద్రత లేకుండా పోయింది. ఇదే గోడౌన్‌కు టెక్కలి, నందిగాం మండలాలతో పాటు వజ్రపుకొత్తూరు మండలానికి సంబంధించి కొంతభాగం సరుకులు ప్రతీనెలా వస్తుంటాయి. టెక్కలి మండలంలో 50 రేషన్ డిపోల పరిధిలోని 21,765 రేషన్ కార్డులు, నందిగాం మండలంలోని 48 రేషన్ డిపోల పరిధిలో 18,222 కార్డుదారులకు సంబంధించి, అలాగే వజ్రపుకొత్తూరు మండలంలోని 18 రేషన్ డిపోలకు సంబంధించి ప్రతీనెలా ఈ గోడౌన్‌లో బియ్యం, పంచదారతో పాటు ఐసీడీఎస్‌కు సంబంధించిన బియ్యం, కంది పప్పు, నూనెను నిల్వ చేసి తరలిస్తుంటారు.

పొంచివున్న దొంగల బెడద

ఈ క్రమంలో మారుమూల ప్రాంతంలో ఉన్నటువంటి ఈ స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల బెడద పొంచి ఉంది. గతంలో ఇదే స్టాక్ పాయింట్‌లో తరచూ దొంగతనాలు చోటుచేసుకుని సరుకులు మాయం అయ్యేవి. దీంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరలా ఇప్పుడు నెలల తరబడి సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, దీనిపై అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. అందువలన ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టెక్కలి ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకొచ్చి, ప్రజా పంపిణీ సరుకులకు భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నిఘా లేకపోవడం ఆశ్చర్యం

ప్రజా పంపిణీ సరుకులు నిల్వ చేసే గోడౌన్ వద్ద నిఘా లేకపోవడం ఆశ్చర్యంగా ఉంది. టెక్కలిలో మారుమూల ప్రాంతంలో ఉన్నటువంటి ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఉండాలి. నెలల తరబడి సీసీ కెమెరాలు పనిచేయకపోతే అధికారులు ఎందుకు స్పందించడం లేదు. తక్షణమే నిఘా వ్యవస్థ పనిచేసే విధంగా చూడాలి.

– చల్లా రామారావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధి, టెక్కలి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. గోడౌన్ వద్ద భద్రత విషయంలో పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం. పౌర సరఫరాల శాఖ డీఎంకి సీసీ కెమెరాల సమస్య విన్నవించాం.

– నానిబాబు, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి, టెక్కలి

• అలల హోరు.. కేరింతల జోరు



బారువ తీరంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీ కయాకింగ్ పోటీలు



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



శనివారం రాత్రి తీరంలో పర్యాటకుల సందడి

బారువ తీరం జనసంద్రమైంది. శనివారం మరోసారి నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పోటెత్తారు. దీనిలో భాగంగా చేపట్టిన పలు పోటీలు ఆకట్టుకున్నాయి. అలాగే తీరంలో ఫుడ్ స్టాల్స్ నిర్వహించారు.. ఆదివారం కూడా ఫెస్టివల్ కొనసాగనుంది.

– సోంపేట

ప్రమాదకరం



టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో మెయిన్ స్కూల్‌కు ఎదురుగా రోడ్డుకు ఏర్పడిన హోల్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో రక్షిత మంచినీటి సరఫరాకు సంబంధించి వాల్వ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశారు. ఆ కంట్రోల్ వద్ద భారీగా గొయ్యి ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన రంధ్రాన్ని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

– టెక్కలి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



గీతాయజ్ఞంను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని బాలకృష్ణాపురం గ్రామంలో రాధాకృష్ణుల నూతన ఆలయం ప్రతిష్ఠ సందర్భంగా జరుగుతున్న గీతా యజ్ఞంను శనివారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్ కారంగి త్రినాథ్, ఆశి పురుషోత్తం, ఆశి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేటెంట్ హక్కులు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ స్వామి

టెక్కలి: సరికొత్త ఆలోచనలతో రూపొందించే ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు తప్పనిసరిగా ఉండాలని నోవల్ పేటెంట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ స్వామి సూచించారు. ప్రొటెక్టింగ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ ఐపీ మేనేజ్‌మెంట్ ఫర్ స్టార్టప్స్ అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాపీరైట్స్, ట్రేడ్‌మార్క్, ట్రేడ్ సీక్రెట్స్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్‌లు డి.శ్రీరాములు, డి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పైడిగాం ప్రాజెక్టును ఆధునీకరించాలి



కంచిలి: జీపుజాత బృందానికి వినతిపత్రం అందజేస్తున్న బూరగాం రైతులు



పలాసలో జీపుయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



నందిగాం: మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మోహనరావు

కంచిలి: కంచిలి, సోంపేట మండలాల రైతులకు సాగునీరు అందిస్తున్న పైడిగాం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని బూరగాం రైతు సంఘం డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని, శివారు భూములకు సాగునీరు అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ నిర్వహిస్తున్న జీపు జాత శనివారం బూరగాం చేరుకుంది. దీంతో స్థానిక పైడిగాం ఆయకట్టు రైతులు వినతిపత్రం అందజేశారు. పైడిగాం కాలువకు సంబంధించి ప్రధాన కాలువ సిమెంటు లైనింగ్ చేయాలని, మధుములకు షట్టర్లు బిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి వెలమల రమణ, అజయ్, భాస్కర్, సూరయ్య, బత్తిని లక్ష్మీనారాయణ, పి.చంద్రరావు, స్థానిక రైతు సంఘం ప్రతినిధులు కప్ప గోపీనాథ్, కాయ ఢిల్లీరావు, బుడ్డ చిన్నయ్య, బుడ్డ భైరి, రంగాల చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు పునరుద్ధరించాలి

సోంపేట: మండలంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పునరుద్ధరించాలని రైతు సంఘ ప్రతినిధులు, కౌలు రైతు సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరుతూ శ్రీకాకుళం నుంచి నిర్వహిస్తున్న జీపుజాత శనివారం సోంపేట చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన జరగనున్న మహా ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

మహాధర్నా విజయవంతం చేయాలి

మందస: ఈనెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.మోహన్‌రావు, చంద్రరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మందసలో జీపు యాత్ర శనివారం నిర్వహించారు. జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్రతనయలపై ఆనకట్టలు కట్టినట్లయితే జిల్లాలోని భూములకు రెండు పంటలకు నీరు అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు వెలమల రమణ, తెప్పల అజయ్, బత్తిని లక్ష్మీనారాయణ, మట్ట ధర్మారావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: జిల్లా రైతాంగానికి ప్రాణాధారమైన, 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన వంశధార కాలువ ఆధునీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోనారి మోహనరావు అన్నారు. జీపు జాతర కార్యక్రమం నందిగాం చేరుకున్న సందర్భంగా మాట్లాడారు. ఆఫ్‌షోర్‌కు నిధులు కేటాయించకుండా పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.